https://siddipettimes.com

# సిద్దిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 | సంచిక -338 | తెలంగాణ | గురువారం | తేదీ: 14.05.2026 | ఎడిటర్ : మదూరి శ్రీరామ్ | పేజీలు 8 | వెల రూ.3

## ఇంధన పొదుపు దిశగా ప్రధాని మోదీ ముందడుగు

- కాన్వాయ్‌లో వాహనాల సంఖ్య భారీ తగ్గింపు
- రెండు వాహనాల కాన్వాయ్‌తోనే ప్రధాని నరేంద్ర మోదీ ప్రయాణం
- ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వాహనాల సంఖ్య 50 శాతం తగ్గింపు
- మోదీ బాటలోనే అమిత్ షా, యోగి ఆది-త్యనాథ్ సహా ప్రముఖులు

2లో..



# వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా గ్రోత్ కారిడార్ల డిజైన్ ఉండాలి

### ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

- వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాలకు ఓఆర్ఆర్ నిర్మాణం
- పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ సాంకేతికత వినియోగం
- మున్సిపాలిటీల్లో సోలార్ ప్లాంట్లు, ఈవీ వాహనాల వినియోగంపై ఆదేశం



సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :
రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు మెగా గ్రోత్ కారిడార్లలో ఏకరీతి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు తెలంగాణకు వరంగల్, కరీంనగర్, ఖమ్మం కార్పొరేషన్ల అభివృద్ధి అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ మూడు నగరాల పరిధిలో గ్రోత్ కారిడార్లను పటిష్టం చేయడంతో పాటు, వీటికి ఔటర్ రింగ్ రోడ్లను (ర్మించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ ఒక కారిడార్, కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలను కలిపి మరో గ్రోత్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రాంతాల వారీగా ఉన్న ప్రత్యేకతలను బట్టి అభివృద్ధి మ్యాపులు సిద్ధం చేయాలన్నారు. ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలకు ఊతమిచ్చేలా ప్రత్యేక కారిడార్ల ఏర్పాటుపై ముఖ్యమంత్రి దృష్టి సారించారు. నల్గొండ - యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్‌ను, ఆదిలాబాద్‌లోని నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు. అలాగే రాబోయే కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధికి తక్షణమే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. సింగరేణి పరిధిలోని అన్ని మున్సిపాలిటీలను ఒకే యూనిట్‌గా పరిగణించి అభివృద్ధి చేయాలని, ఆ సంస్థకు సంబంధించిన సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేసేలా చూడాలన్నారు.

2లో..



# రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

- వాహన సమస్యతో ధాన్యం నిలువ ఉండకూడదు..
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 13
వాహన సమస్యతో ఏ ఒక్క కొనుగోలు కేంద్రాలలో కూడా ధాన్యం నిలువ ఉండకూడదని, రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లాలో 2026 ఏసంగి కాలపు వరిధాన్యము కొనుగోలు పై రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కే.హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్ తో కలిసి సంబంధిత శాఖల జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లు, వరిధాన్యం ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... అంచనాకు మించి జిల్లాలో ఈ ఏసంగీకాలంలో 4 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వరి ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 427 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 390 ప్రారంభించుకొని 1 లక్ష 20 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు రవాణా చేసి మిల్లులో దించుకోవడం జరిగిందన్నారు.

2లో..

## రోప్ తెగి కిందపడిన లిఫ్ట్... మంత్రి అడ్లూరికి తప్పిన ప్రమాదం

- కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఘటన
- మొదటి అంతస్తు నుంచి కిందకు వస్తుండగా తెగిపోయిన లిఫ్ట్ కేబుల్
- తలుపులు పగులగొట్టి మంత్రిని సురక్షితంగా బయటకు తీసిన సిబ్బంది

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :
తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతును పరామర్శించేందుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంత్రి ప్రయాణిస్తున్న లిఫ్ట్ రోప్ ఒక్కసారిగా తెగిపోవడంతో అది కిందకు పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలు కాగా, అక్కడే ఉన్న వైద్యులు తక్షణమే ప్రాథమిక చికిత్స అందించారు. ప్రమాదం జరిగిన సమయంలో మంత్రి మొదటి అంతస్తు నుంచి కిందకు వచ్చేందుకు లిఫ్ట్ ఎక్కారు.

## మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టండి

- ఉబర్ సీఈఓకు సీఎం రేవంత్ రెడ్డి సూచన
- హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరించనున్న ఉబర్
- భారత్ ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ కార్యాలయ ఏర్పాటుకు ఆసక్తి
- మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్, ఈవీ ఛార్జింగ్ సెంటర్ల ఏర్పాటుపై చర్చ

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :
హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావాలని ఉబర్ (Uber) సంస్థకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సీఈఓ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సందర్భంగా మెట్రో స్టేషన్ల వద్ద తలెత్తుతున్న పార్కింగ్ ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ఈవీ ఛార్జింగ్ సదుపాయాలతో కూడిన మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఉన్న తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మరింత విస్తరిస్తున్నట్లు దారా ఖోస్రోషాహి ఈ సందర్భంగా వెల్లడించారు.



## పోక్సో కేసులో పోలీసుల విచారణకు బండి భగీరథ్ గైర్హాజరు

- వ్యక్తిగత కారణాల వల్ల రాలేనని పేట్‌బషీరాబాద్ పోలీసులకు మెయిల్
- ఆధారాలు సేకరించేందుకు రెండు రోజుల గడువు కోరిన కేంద్ర మంత్రి కుమారుడు
- ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్.. నేడు విచారణ

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్, తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం పోలీసుల విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల తాను రాలేకపోతున్నానని, విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు రెండు రోజుల గడువు కావాలని కోరుతూ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఆయన మెయిల్ పంపించారు. తక్కువ సమయంలో నోటీసులు అందాయని, తనపై వచ్చిన ఆరోపణలకు వ్యతిరేకంగా ఆధారాలు సేకరించేందుకు సమయం కావాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

## టాలీవుడ్‌కు 'ఐబొమ్మ' సెగ

- మళ్లీ ప్రత్యక్షమైన పైరసీ సైట్
- ఐబొమ్మ రవి అరెస్ట్ తర్వాత కూడా ఆగని అక్రమ స్ట్రీమింగ్
- డొమైన్లు మారుస్తూ కొత్త సినిమాలను అప్‌లోడ్ చేస్తున్న నిర్వాహకులు
- అంతర్జాతీయ నెట్‌వర్క్‌పై పోలీసుల ఆరా.. దర్యాప్తు వేగవంతం

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :
తెలుగు సినీ పరిశ్రమను దశాబ్దాలుగా వేధిస్తున్న పైరసీ భూతం 'ఐబొమ్మ' మళ్లీ ప్రత్యక్షమై టాలీవుడ్ పెద్దలకు షాక్ ఇచ్చింది. గతంలో సైబరాబాద్ పోలీసులు ఈ నెట్‌వర్క్ కీలక సూత్రధారి రవిని అరెస్ట్ చేయడంతో ఈ వెబ్‌సైట్ కథ ముగిసిందని అంతా భావించారు. అయితే, ఆయన బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే ఐబొమ్మ వెబ్‌సైట్ మళ్లీ యాక్టివ్ అవ్వడం సంచలనంగా మారింది. ప్రస్తుతం థియేటర్లలో ప్రదర్శితమవుతున్న సినిమాలు, ఓటీటీ వేదికల్లో విడుదలైన కొత్త కంటెంట్‌ను ఐబొమ్మ నిర్వాహకులు యథేచ్ఛగా పైరసీ చేస్తున్నారు.






## బలపరీక్షలో నెగ్గిన టీవీకే

- తమిళనాడు శాసనసభలో విజయ్ సర్కార్ విక్టరీ
- 144 మంది సభ్యుల మద్దతుతో మెజార్టీ నిరూపించుకున్న సీఎం విజయ్
- టీవీకే ప్రభుత్వానికి మద్దతు తెలిపిన కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు
- అసెంబ్లీ నుంచి డీఎంకే వాకౌట్.. విమర్శలు గుప్పించిన ఉదయనిధి స్టాలిన్

2లో..

## 45 ఏళ్ల తర్వాత పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ

- ఇంటర్ సెకండియర్ తెలుగు పరీక్షకు హాజరైన తిప్పిరి తిరుపతి
- 1982లో విద్యార్థి ఉద్యమ సమయంలో పరీక్ష బహిష్కరణ
- న్యాయవాద కోర్సు చేసి పేదలకు సేవ చేస్తానని వెల్లడి

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :
మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సుదీర్ఘ విరామం తర్వాత విద్యార్థిగా మారారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత ఆయన ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. జగిత్యాల జిల్లా కోరుట్లలోని మ్యాస్ట్రో జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో బుధవారం జరిగిన ఇంటర్ సెకండియర్ తెలుగు పరీక్షను ఆయన రాశారు. 1980-82 కాలంలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దేవ్‌జీ ఇంటర్ ఎంపీసీ చదివారు.



# 45 ఏళ్ల తర్వాత పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ

**-ఇంటర్ సెకండియర్ తెలుగు పరీక్షకు హాజరైన తిప్పిరి తిరుపతి**
**-1982లో విద్యార్థి ఉద్యమ సమయంలో పరీక్ష బహిష్కరణ**
**-న్యాయవాద కోర్సు చేసి పేదలకు సేవ చేస్తానని వెల్లడి**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :**

మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సుదీర్ఘ విరామం తర్వాత విద్యార్థిగా మారారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత ఆయన ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. జగిత్యాల జిల్లా కోరుట్లలోని మ్యాస్ట్రో జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో బుధవారం జరిగిన ఇంటర్ సెకండియర్ తెలుగు పరీక్షను ఆయన రాశారు. 198082 కాలంలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దేవ్‌జీ ఇంటర్ ఎంపీసీ చదివారు. అప్పట్లో విద్యార్థి రాడికల్ యూనియన్‌లో చురుగ్గా పనిచేస్తున్న ఆయన, ఒక పోరాట పిలుపులో భాగంగా సెకండియర్ తెలుగు పరీక్షను బహిష్కరించి అజ్ఞాతంలోకి వెళ్లారు. దశాబ్దాల పాటు మావోయిస్టు ఉద్యమంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన, ఈ ఏడాది ఫిబ్రవరిలో జనజీవన స్రవంతిలో కలిశారు. అసంపూర్తిగా మిగిలిపోయిన తన విద్యను పూర్తి చేసేందుకు ఇంటర్ బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి తీసుకున్న దేవ్‌జీ, ఎట్టకేలకు తెలుగు పరీక్షను పూర్తి చేశారు. తన భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ.. ఇంటర్ తర్వాత న్యాయవాద కోర్సు (ఎల్ఎల్బీ) చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. లాయర్‌గా మారి పేద ప్రజలకు న్యాయం అందించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# పోక్సో కేసులో పోలీసుల విచారణకు బండి భగీరథ్ గైర్హాజరు

**-వ్యక్తిగత కారణాల వల్ల రాలేనని పేట్‌బషీరాబాద్ పోలీసులకు మెయిల్**
**-ఆధారాలు సేకరించేందుకు రెండు రోజుల గడువు కోరిన కేంద్ర మంత్రి కుమారుడు**
**-ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్.. నేడు విచారణ**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్, తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం పోలీసుల విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల తాను రాలేకపోతున్నానని, విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు రెండు రోజుల గడువు కావాలని కోరుతూ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఆయన మెయిల్ పంపించారు. తక్కువ సమయంలో నోటీసులు అందాయని, తనపై వచ్చిన ఆరోపణలకు వ్యతిరేకంగా ఆధారాలు సేకరించేందుకు సమయం కావాలని ఆ లేఖలో పేర్కొన్నారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కఠినమైన సెక్షన్లు 5(1), 6ను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు, బుధవారం మధ్యాహ్నం విచారణకు రావాలని నోటీసులు జారీ చేయగా భగీరథ్ గడువు కోరారు. మరోవైపు, ఈ కేసులో అరెస్టు నుంచి రక్షణ పొందేందుకు భగీరథ్ తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది. తనపై తప్పుడు కేసు పెట్టి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని బాధితురాలి కుటుంబంపై భగీరథ్ ఇప్పటికే కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తునకు తాను పూర్తిగా సహకరిస్తానని, విచారణకు మరో తేదీని కేటాయించాలని ఆయన పోలీసులను కోరారు.

# ఇంధన పొదుపు దిశగా ప్రధాని మోదీ ముందడుగు

**- కాన్వాయ్‌లో వాహనాల సంఖ్య భారీ తగ్గింపు**
**-రెండు వాహనాల కాన్వాయ్‌తోనే ప్రధాని నరేంద్ర మోదీ ప్రయాణం**
**-ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వాహనాల సంఖ్య 50 శాతం తగ్గింపు**
**-మోదీ బాటలోనే అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :**

ప్రధాని నరేంద్ర మోదీ తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను భారీగా తగ్గించుకొని దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు పాటించాలని పిలుపునిచ్చిన ప్రధాని, స్వయంగా ఆచరణలో పెట్టారు. సాధారణంగా 12 నుంచి 15 వాహనాలతో ఉండే తన కాన్వాయ్‌ను కేవలం రెండు వాహనాలకు పరిమితం చేస్తూ ఆయన ప్రయాణించారు. ఇంధన వినియోగాన్ని తగ్గించే లక్ష్యంతో కాన్వాయ్ సైజును 50 శాతం కుదించాలని ప్రధాని ఆదేశించినట్లు ఎస్పీజీ (SPG) అధికారులు వెల్లడించారు. సాధారణంగా ప్రధానమంత్రి భద్రత కోసం మెర్సిడెస్ అల్ట్రా లగ్జరీ కారుతో పాటు రేంజ్ రోవర్లు, టయోటా ఫార్చ్యూనర్లు, జామర్ యూనిట్లు కలిపి పెద్ద కాన్వాయ్ ఉంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన పొదుపు మంత్రం పాటిస్తూ, భద్రతా ప్రోటోకాల్ దెబ్బతినకుండానే వాహనాల సంఖ్యను తగ్గించినట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రధాని వెళ్లే మార్గాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లు యథావిధిగా కొనసాగుతాయని, కేవలం కాన్వాయ్‌లోని వాహనాల విషయంలోనే ఈ మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం స్ఫూర్తితో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు కూడా తమ కాన్వాయ్ పరిమాణాన్ని రెండు వాహనాలకు తగ్గించుకున్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉన్న విపత్కర పరిస్థితుల్లో ప్రజా ప్రతినిధులు ఇలా పొదుపు చర్యలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

# రోప్ తెగి కిందపడిన లిఫ్ట్... మంత్రి అడ్లూరికి తప్పిన ప్రమాదం

**-కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఘటన**
**-మొదటి అంతస్తు నుంచి కిందకు వస్తుండగా తెగిపోయిన లిఫ్ట్ కేబుల్**
**-తలుపులు పగులగొట్టి మంత్రిని సురక్షితంగా బయటకు తీసిన సిబ్బంది**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :**

తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతును పరామర్శించేందుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంత్రి ప్రయాణిస్తున్న లిఫ్ట్ రోప్ ఒక్కసారిగా తెగిపోవడంతో అది కిందకు పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలు కాగా, అక్కడే ఉన్న వైద్యులు తక్షణమే ప్రాథమిక చికిత్స అందించారు. ప్రమాదం జరిగిన సమయంలో మంత్రి మొదటి అంతస్తు నుంచి కిందకు వచ్చేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ కదులుతుండగా అకస్మాత్తుగా సాంకేతిక లోపం తలెత్తి, రోప్ తెగిపోవడంతో అది నేరుగా కిందికి కుప్పకూలింది. దీంతో మంత్రి లిఫ్ట్ లోపలే ఇరుక్కుపోయారు. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామంతో అక్కడున్న వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మరియు పోలీసులు వెంటనే స్పందించి లిఫ్ట్ తలుపులను తెరిచారు. లోపల ఉన్న మంత్రిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు ఆసుపత్రిలోని లిఫ్ట్ నిర్వహణ తీరుపై విచారణ చేపట్టారు.

# టాలీవుడ్‌కు 'ఐబొమ్మ' సెగ

**-మళ్లీ ప్రత్యక్షమైన పైరసీ సైట్**
**-ఐబొమ్మ రవి అరెస్ట్ తర్వాత కూడా ఆగని అక్రమ స్ట్రీమింగ్**
**-డొమైన్లు మారుస్తూ కొత్త సినిమాలను అప్‌లోడ్ చేస్తున్న నిర్వాహకులు.**
**-అంతర్జాతీయ నెట్‌వర్క్‌పై పోలీసుల ఆరా.. దర్యాప్తు వేగవంతం**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :**

తెలుగు సినీ పరిశ్రమను దశాబ్దాలుగా వేధిస్తున్న పైరసీ భూతం 'ఐబొమ్మ' మళ్లీ ప్రత్యక్షమై టాలీవుడ్ పెద్దలకు షాక్ ఇచ్చింది. గతంలో సైబరాబాద్ పోలీసులు ఈ నెట్‌వర్క్ కీలక సూత్రధారి రవిని అరెస్ట్ చేయడంతో ఈ వెబ్‌సైట్ కథ ముగిసిందని అంతా భావించారు. అయితే, ఆయన బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే ఐబొమ్మ వెబ్‌సైట్ మళ్లీ యాక్టివ్ అవ్వడం సంచలనంగా మారింది. ప్రస్తుతం థియేటర్లలో ప్రదర్శితమవుతున్న సినిమాలు, ఓటీటీ వేదికల్లో విడుదలైన కొత్త కంటెంట్‌ను ఐబొమ్మ నిర్వాహకులు యథేచ్ఛగా పైరసీ చేస్తున్నారు. తమ డొమైన్లను నిరంతరం మారుస్తూ పోలీసుల కళ్లుగప్పి కొత్త చిత్రాలను సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సినీ పరిశ్రమకు భారీగా నష్టం చేకూరుస్తున్న ఈ వెబ్‌సైట్ పునరాగమనంపై చిత్ర నిర్మాతల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నిర్వాహకుడు రవిపై పోలీసుల నిఘా ఉన్నప్పటికీ సైట్ మళ్లీ ఎలా మొదలైందనే కోణంలో సైబరాబాద్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. దీని వెనుక ఏదైనా అంతర్జాతీయ నెట్‌వర్క్ ఉందా లేదా ఇతర సర్వర్ల ద్వారా మరెవరైనా ఆపరేట్ చేస్తున్నారా అనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు. పైరసీకి అడ్డుకట్ట వేసేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన గట్టి చర్యలు తీసుకోవాలని సినీ ప్రముఖులు కోరుతున్నారు.

# వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా గ్రోత్ కారిడార్ల డిజైన్ ఉండాలి

**- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**
**-వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాలకు ఓఆర్ఆర్ నిర్మాణం**
**-పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ సాంకేతికత వినియోగం**
**-మున్సిపాలిటీల్లో సోలార్ ప్లాంట్లు, ఈవీ వాహనాల వినియోగంపై ఆదేశం**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :**




రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు మెగా గ్రోత్ కారిడార్లలో ఏకరీతి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు తెలంగాణకు వరంగల్, కరీంనగర్, ఖమ్మం కార్పొరేషన్ల అభివృద్ధి అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ మూడు నగరాల పరిధిలో గ్రోత్ కారిడార్లను పటిష్టం చేయడంతో పాటు, వీటికి ఔటర్ రింగ్ రోడ్లను (ర్మిం చాలని స్పష్టం చేశారు. మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ ఒక కారిడార్, కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలను కలిపి మరో గ్రోత్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రాంతాల వారీగా ఉన్న ప్రత్యేకతలను బట్టి అభివృద్ధి మ్యాపులు సిద్ధం చేయాలన్నారు. ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలకు ఊతమిచ్చేలా ప్రత్యేక కారిడార్ల ఏర్పాటుపై ముఖ్యమంత్రి దృష్టి సారించారు. నల్గొండ యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్‌ను, ఆదిలాబాద్‌లోని నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు. అలాగే రాబోయే కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధికి తక్షణమే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. సింగరేణి పరిధిలోని అన్ని మున్సిపాలిటీలను ఒకే యూనిట్‌గా పరిగణించి అభివృద్ధి చేయాలని, ఆ సంస్థకు సంబంధించిన సీఎస్ఆర్ (CSR) నిధులను స్థానికంగానే ఖర్చు చేసేలా చూడాలన్నారు. గ్రోత్ కారిడార్లలో ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు (STP), భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలు ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతిపాదిత విమానాశ్రయాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పన జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుతో ఆ ప్రాంత రూపురేఖలు మారుతాయని, దానికి కావాల్సిన నీటి వసతిపై ముందే దృష్టి సారించాలన్నారు. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌ను రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ఈ విమానాశ్రయాల అనుసంధానంతో అభివృద్ధి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ నగరాల్లో విద్యుత్ వాహనాలను (EV) ప్రోత్సహించాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీల్లో ఖర్చు తగ్గించుకోవడానికి లీజుకు తీసుకునే వాహనాలన్నీ ఈవీలే ఉండాలని, ప్రతి చోట సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో రేడియేషన్ ప్రభావం తగ్గించడానికి మల్టీ యుటిలిటీ టవర్లను నిర్మించాలని అధికారులకు తెలిపారు. నగరాల్లో ప్రధాన సమస్యగా మారిన ట్రాఫిక్ నియంత్రణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతను వినియోగించాలని సీఎం సూచించారు. ఇందుకోసం సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకోవాలని కోరారు. వచ్చే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ పోల్స్, రోడ్లు, పునరుత్పాదక ఇంధన వనరుల వంటి అంశాలపై ఒకే విధమైన ప్రణాళికతో (Uniform Planning) ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు.

# మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టండి

**- ఉబర్ సీఈఓకు సీఎం రేవంత్ రెడ్డి సూచన**
**-హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరించనున్న ఉబర్**
**-భారత్ ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ కార్యాలయ ఏర్పాటుకు ఆసక్తి**
**-మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్, ఈవీ ఛార్జింగ్ సెంటర్ల ఏర్పాటుపై చర్చ**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 13 :**

హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావాలని ఉబర్ (Uber) సంస్థకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సీఈఓ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సందర్భంగా మెట్రో స్టేషన్ల వద్ద తలెత్తుతున్న పార్కింగ్ ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ఈవీ ఛార్జింగ్ సదుపాయాలతో కూడిన మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఉన్న తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మరింత విస్తరిస్తున్నట్లు దారా ఖోస్రోషాహి ఈ సందర్భంగా వెల్లడించారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ప్రస్తుతం ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వ సహకారం కోరారు. ముఖ్యమంత్రి సూచించిన పార్కింగ్ కేంద్రాల ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తూ, దీనిపై సమగ్రంగా అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాధాన్యతను ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 30 వేల ఎకరాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయని తెలిపారు.



ఈ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయాన్ని నిర్మించేందుకు ఖోస్రోషాహి ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఉబర్ ఉన్నతాధికారులతో పాటు సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# బలపరీక్షలో నెగ్గిన టీవీకే

**-తమిళనాడు శాసనసభలో విజయ్ సర్కార్ విక్టరీ**
**-144 మంది సభ్యుల మద్దతుతో మెజార్టీ నిరూపించుకున్న సీఎం విజయ్**
**-టీవీకే ప్రభుత్వానికి మద్దతు తెలిపిన కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు**
**-అసెంబ్లీ నుంచి డీఎంకే వాకౌట్.. విమర్శలు గుప్పించిన ఉదయనిధి స్టాలిన్**

**సిద్దిపేట టైమ్స్, చెన్నై, మే 13 :**

తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ శాసనసభలో తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో విజయ్ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించింది. ఈ ఉదయం సభలో విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ జరిగిన అనంతరం స్పీకర్ ఓటింగ్ నిర్వహించారు. సాధారణ పద్ధతిలో కాకుండా, ఒక్కో సభ్యుడి పేరు పిలుస్తూ ఎమ్మెల్యేల సమ్మతిని సభాపతి నమోదు చేయడం విశేషం. బలపరీక్షలో విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయగా, 22 మంది సభ్యులు వ్యతిరేకించారు. టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలతో పాటు అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు కూడా మద్దతు తెలిపారు. అయితే, బలపరీక్ష సమయంలో ప్రధాన ప్రతిపక్షం డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. 234 స్థానాలున్న అసెంబ్లీలో 108 సీట్లు గెలుచుకున్న టీవీకే, ఇతర మిత్రపక్షాల అండతో గట్టెక్కింది. అంతకుముందు జరిగిన చర్చలో అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు విజయ్ ప్రయత్నించారని పళనిస్వామి ఆరోపించగా, ఇది ప్రజల కోసం పనిచేసే 'రియల్' ప్రభుత్వం కాదని, 'రీల్' ప్రభుత్వం అంటూ ఉదయనిధి ఎద్దేవా చేశారు. కూటమిలోని ఇతర పార్టీల మద్దతు వల్లే విజయ్ ప్రభుత్వం నిలబడిందని, ఎమ్మెల్యేల కొనుగోళ్లతో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోందని ఉదయనిధి విమర్శించారు. అన్నాడీఎంకేలో నెలకొన్న విభేదాలు సభలో మరోసారి స్పష్టమయ్యాయి. పళనిస్వామి ఆరోపణలను రెబల్ వర్గ నేత వేలుమణి ఖండించారు. తామంతా విజయ్ ప్రభుత్వానికే మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని పళనిస్వామి వాదించినప్పటికీ, రెబల్ వర్గం సీఎంకు అనుకూలంగా ఓటేయడం చర్చనీయాంశమైంది. అటు డీఎంకే సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనబోమని ప్రకటించి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. బలపరీక్ష అనంతరం విజయ్ మాట్లాడుతూ తనకు మద్దతిచ్చిన పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం ఐదేళ్ల పాటు సుస్థిరంగా ఉంటుందని, లౌకిక విధానంతో సామాజిక న్యాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామన్నారు. ఓఎస్డీ నియామకంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని పునఃసమీక్షిస్తామని విజయ్ సభకు వెల్లడించారు.

# రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి..

**-వాహన సమస్యతో ధాన్యం నిలువ ఉండకూడదు..**
**-రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 13**





వాహన సమస్యతో ఏ ఒక్క కొనుగోలు కేంద్రాలలో కూడా ధాన్యం నిలువ ఉండకూడదని, రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లాలో 2026 ఏసంగి కాలపు వరిధాన్యము కొనుగోలు పై రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కే.హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్ తో కలిసి సంబంధిత శాఖల జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లు, వరిధాన్యం ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... అంచనాకు మించి జిల్లాలో ఈ ఏసంగికాలంలో 4 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వరి ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 427 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 390 ప్రారంభించుకొని 1 లక్ష 20 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు రవాణా చేసి మిల్లులో దించుకోవడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 54 రైస్ మిల్లులలో దాదాపు 1000 మంది హమాలీల ద్వారా ధాన్యం దించుకోవడం జరుగుతుందన్నారు. రైస్ మిల్లుల వద్ద ఉన్న హమాలీలను కొనుగోలు కేంద్రాలలో ఉపయోగించరాదన్నారు. రైస్ మిల్లులలో మరో 1000 హమాలీలను అదనంగా నియమించుకొని ధాన్యం దించుకోవడం వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద స్థానిక గ్రామాల హమాలీలను మహిళా సహాయక సంఘాల సహకారంతో నియమించుకోవాలన్నారు. తేమశాతంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రవాణా చేసి మిల్లులో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బంది కలగకుండా కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో పోలీస్, ట్రాన్స్ పోర్ట్, రెవెన్యూ శాఖలు వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. వాహన సమస్యతో ఏ ఒక్క కొనుగోలు కేంద్రాలలో కూడా ధాన్యం నిలువ ఉండరాదన్నారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయడానికి మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ పాలనాధికారి, కొనుగోలు కేంద్రం ఇంచార్జి సమన్వయం చేయాలన్నారు. మండల స్థాయిలో తాసిల్దార్, ఎంపీడీవో ,ఎంపీవో, ఎస్సై, ఐకెపి ఏపిఎం, పిఎస్సిఎస్ సీఈవోలు ప్రతిరోజు సమావేశం ఏర్పాటు చేసుకొని సమన్వయం చేయాలి. ఆర్డీవోలు ఓవరాల్ పర్యవేక్షణ చేయాలన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో, ఏసిపిలు సమన్వయం చేయాలన్నారు. జిల్లా స్థాయిలో పిడి డిఆర్డీఏ, డీపిఓ ,కోపరేటివ్ ,లేబర్ ఆఫీసర్ ,మార్కెటింగ్ ఏడి లు సమన్వయం చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిరోజు వరిధాన్యం కొనుగోలు పై పర్యవేక్షిస్తున్నారని, కాబట్టి జిల్లాలో ప్రతిరోజు 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులలో దించుకుంటే పది రోజులలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ దాదాపు పూర్తవుతుందని ఈ దిశగా మిల్లర్లు, అధికారులు, వాహన ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇలాంటి అత్యవసర సమయంలో రైస్ మిల్లర్లు పూర్తిగా సహకరించి లేబర్ లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకొని ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దించుకుంటే వారి సమస్యలపై ప్రభుత్వంతో చర్చించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. రైతులు సన్న బియ్యం పండించడానికి వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యాచరణ తో ముందుకు సాగాలని, ఏఈవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సన్న రకం వరి ధాన్యాన్ని పండించే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు.

జిల్లాలో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వరి ధాన్యం పండించాలన్నారు.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో వరి ధాన్యం సేకరణలో భాగంగా 427 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇప్పటికీ 1లక్ష 20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందన్నారు. ఈ సీజన్లో 4 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. జిల్లాలో గల 54 మిల్లులలో వెయ్యి మంది హమాలీలతో ధాన్యం అన్లోడింగ్ జరుగుతోందన్నారు. 250 లారీలు 200 ట్రాక్టర్లతో ధాన్యం రవాణా జరుగుతుందన్నారు. జిల్లాలో 46 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి రాగా రైతులకు ఇబ్బంది కలగకుండా ఇప్పటికే 24500 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను రైతుల నుండి కొనుగోలు చేశామన్నారు. సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, మిరుదొడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీలలో మొక్కజొన్నను ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గజ్వేల్ హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి లు, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా సహకార అధికారి వరలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, జిల్లా కార్మిక శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా తూనికలు మరియు కొలతల అధికారి శివరంజని, ఇతర అధికారులు, రైస్ మిల్లర్లు, వరిధాన్యం ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.





# శేరుపల్లి బందారం గ్రామంలో దళిత రైతువరిపంట కోత ఘటన

**- నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీబీఎఫ్ డిమాండ్**

**దౌల్తాబాద్, మే 13 (సిద్దిపేట టైమ్స్):**

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం శేరుపల్లి బందారం గ్రామానికి చెందిన దళిత రైతు పొట్టోళ్ల ఎల్లయ్య సాగు చేసిన వరి పంటను కోసుకుపోయిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) నిజానిర్ధారణ బృందం డిమాండ్ చేసింది.బుధవారం శేరుపల్లి బందారం గ్రామంలో బాధిత కుటుంబాన్ని కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను బృందం సేకరించింది. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్న గారి. శంకర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన దళితుడు పొట్టోళ్ల ఎల్లం కుటుంబానికి చెందిన సర్వే నెంబర్ 264/52లో ఉన్న ఒక ఎకరం 20 గుంటల భూమిలో సాగుచేసిన వరి పంటను ఆధిపత్య వర్గానికి చెందిన నర్సింహారెడ్డి అర్ధరాత్రి సమయంలో అప్పు పేరుతో కోసుకుపోయాడని ఆరోపించారు.ఎల్లం గతంలో నర్సింహారెడ్డి వద్ద జీతం పనిచేసి కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడని, ఆ అప్పుపై వడ్డీ పేరుతో అక్రమంగా రూ.11 లక్షలు చెల్లించాలని ఒత్తిడి తెస్తూ దళిత కుటుంబానికి చెందిన అసైన్డ్ భూమిని అన్యాక్రాంతం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై బాధిత కుటుంబం న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, భూమి దళిత కుటుంబానికేనని కోర్టు తీర్పు ఇచ్చిందని, అనంతరం ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలను కూడా జారీ చేసిందన్నారు.2025 సంవత్సరం నుంచి బాధిత కుటుంబం మూడు పంటలు సాగు చేస్తోందని తెలిపారు. అయితే ఈ నెల 4 మరియు 7 తేదీల రాత్రి సమయంలో నిందితుడు దొంగచాటుగా వచ్చి పంటను కోసుకుపోయాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబం దౌల్తాబాద్ ఎస్సైకి ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని విమర్శించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు కాలేదని ఆరోపించారు.ఈ నేపథ్యంలో బుధవారం మరోసారి బాధిత కుటుంబం దౌల్తాబాద్ పోలీసులకు ఫిర్యాదు అందజేసిందన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంతో పాటు బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోసుకుపోయిన వరి పంటను తిరిగి బాధిత కుటుంబానికి అందజేయాలని కోరారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నరాజమూర్ లో ఎమ్మెల్యే జిఎంఆర్ పూజలు

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జీఎంఆర్ దేవాలయానికి వెళ్లి పలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘనంగా స్వాగతం పలికారు. దేవాలయంలో పురోహితులు ఎమ్మెల్యే పై అక్షింతలు చల్లి ఆశీర్వచనం పలికారు. అలాగే తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం గ్రామ నాయకులతో కలిసి దేవస్థానం అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు





# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో ఎమ్మెల్యే జీఎంఆర్

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని



ఆయా గ్రామాలలో బుధవారం దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర మండలం అడవి అజిలాపురం, చిన్నరాజమూర్, నార్లోని కుంట గ్రామాల్లో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున నూతన వస్త్రాలను అందజేసి వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చిన్న రాజమూర్, దాడి తండా, నార్లోని కుంట గ్రామాల్లో పలు వివాహాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# జన గణనలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**సిద్దిపేట టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 13**

జన గణనలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.బుధవారం అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామంలోని జనగణన 2027 ను తాహాసిల్దార్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..1881 సంవత్సరం నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి సెన్సస్ నిర్వహించబడుతోందని, కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికి ఇప్పుడు 16వ జన గణన చేపడుతున్నామని తెలిపారు. సర్వేలకు భిన్నంగా సెన్సస్ చట్టబద్ధంగా నిర్వహించబడే ప్రక్రియ అని, ఇందులో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను ఇవ్వాలని, ఎవరూ సమాచారం దాచకూడదని స్పష్టం చేశారు. జనగణన రెండు దశల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 11 నుండి జూన్ 9 వరకు మొదటి దశగా హౌస్ లిస్టింగ్ చేపట్టి ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలపై వివరాలు సేకరిస్తామని చెప్పారు. ఇందులో నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, ఫోన్, ఇంటర్నెట్, తరచుగా వినియోగించే ఆహార ధాన్యాలు వంటి అంశాలు నమోదు చేస్తారని మొత్తం 33 ప్రశ్నల ద్వారా గృహ వివరాలు సేకరించి డిజిటల్‌గా భద్రపరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.







# నీట్ పరీక్ష రద్దు కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఫల్యమే

**-దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆరోపణ**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**



నీట్ పరీక్ష రద్దు కేంద్ర బిజెపి ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యమేనని మహబూబ్ నగర్ జిల్లా దేవజిల్లానియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆరోపించారు. 9 సంవత్సరాల్లో ఇప్పటివరకు 4 సార్లు పేపర్ లీకులు జరిగాయన్నారు. ఇది పూర్తిగా కేంద్ర బీజేపీ సర్కార్ వైఫల్యం అన్నారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అకాడమిక్ ఇయర్ దెబ్బతింటుందన్నారు. తల్లిదండ్రులు ఖర్చు చేసి పిల్లలను చదివిస్తుంటే, పేపర్ లీకులు, పరీక్షల రద్దులతో వారి ఆశలు దెబ్బతింటున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తపరిచారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై బాధ్యత వహించి క్షమాపణ చెప్పడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు నష్టపోకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

* **కుటుంబ పోషకుడు మృతి చెందితే రూ.20 వేల ఆర్థిక సహాయం**
* **ఎంపీడీఓ ఆఫ్జలుద్దీన్ వెల్లడి**

**దౌల్తాబాద్ మే 13(సిద్దిపేట టైమ్స్)**



దౌల్తాబాద్ మండల పరిధిలోని గ్రామాలకు చెందిన అర్హులైన కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఆఫ్జలుద్దీన్ సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి 18 సంవత్సరాల పైబడిన వారు, 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండి మరణించినట్లయితే, ఆ కుటుంబానికి జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ పథకం 2017 ఏప్రిల్ నుంచి అమల్లో ఉందన్నారు.అర్హులైన కుటుంబ సభ్యులు తమ సమీపంలోని మీసేవ కేంద్రాలను సంప్రదించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతర సంబంధిత ధ్రువపత్రాల తో కూడిన దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయం, దౌల్తాబాద్ లో సమర్పించాలని తెలిపారు.దరఖాస్తుతో పాటు ఫోటో జత చేసిన అప్లికేషన్ పత్రం, తెల్ల రేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు, కుటుంబ పోషకుని మరణ ధ్రువీకరణ పత్రం, మృతుని ఆధార్ కార్డు, వయస్సు నిర్ధారణ పత్రం, దరఖాస్తుదారుని ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ ప్రతులను తప్పనిసరిగా జత చేయాలని పేర్కొన్నారు.మండల కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జిల్లా అధికారులకు పంపించి, పథకం మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఆఫ్జలుద్దీన్ తెలిపారు.అర్హులైన పేద కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# జగదేవపూర్ ఐఓబీ భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు వెంటనే ప్రారంభించాలి

* **భవనం నిర్లక్ష్యానికి గురైతే దుండగుల చేత పాడయ్యే ప్రమాదం**
* **జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని సీపీఐ డిమాండ్**

**సిద్దిపేట టైమ్స్, జగదేవపూర్ 13 మే**



జగదేవపూర్ మండల కేంద్రంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్స్ బిల్డింగ్ (ఐఓబీ) నిర్మాణం పూర్తై దాదాపు సంవత్సరం గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాలను ఆ భవనంలోకి మార్చకపోవడం బాధాకరమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సీనియర్ నాయకులు బట్టు దయానంద రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల గౌరవ ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో భవనాన్ని ప్రారంభించినప్పటికీ స్థానిక ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఇప్పటికీ పాత భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంటనే చొరవ తీసుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఐఓబీ భవనంలోకి మార్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భారీ భవనం నిర్లక్ష్యానికి గురైతే అద్దాలు, తలుపులు తదితర సామగ్రిని దుండగులు ధ్వంసం చేసే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాన్ని సంరక్షించడం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.అన్ని శాఖల అధికారులు వెంటనే ఐఓబీ భవనంలో కార్యాలయాలను ప్రారంభించి ప్రజలకు ఒకేచోట సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ తరఫున డిమాండ్ చేశారు.





# నూతన వధూవరులను ఆశీర్వదించిన హైకోర్టు న్యాయవాది

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా అనంత మారుతి గార్డెన్ లో బుధవారం భూత్పూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన నూతన వధూవరులను హైకోర్టు న్యాయవాది,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి ఆశీర్వదించారు. హస్నాపూర్ మాజీ సర్పంచ్ నరసింహ యాదవ్ కుమారుడు రాజ్ కుమార్ వివాహానికి సరోజ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

https://siddipettimes.com
సిద్దిపేట టైమ్స్
తెలుగు దినపత్రిక
బుధవారం, హైదరాబాద్
14-05-2026
http://siddipettimes.com






## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ ధరలు

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు బుధవారం రైతులు 124 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ ధాన్యాన్ని విక్రయానికి తీసుకోవచ్చారు. వీటికి క్వింటాల్ కు అత్యధికంగా రూ. 2413 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ. 2163 ధర పలికింది.35 క్వింటాళ్ల ఉల్లిని రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి కింటాల్ కు అత్యధికంగా రూ. 1500 ధర పలికింది. అలాగే అతి తక్కువ రూ.1100 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## రైతుల కల్లాల వద్దనే ధాన్యం కొనుగోలు చేయాలి

*** ఐకేపీ సెంటర్ల ద్వారా బార్దానా అందించి రైస్ మిల్లులకు తరలించే అవకాశం కల్పించాలి**
*** సీపీఐ సీనియర్ నాయకులు బట్టు దయానంద రెడ్డి డిమాండ్**

**సిద్దిపేట టైమ్స్, జగదేవపూర్, 13 మే**



మండలంలోని గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమై రైతులు రోడ్ల వెంట ధాన్యాన్ని ఆరబోసి అమ్మకానికి సిద్ధం చేస్తున్న నేపథ్యంలో, గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా రైతుల కల్లాల వద్దనే ధాన్యం కొనుగోలు చేసే విధానాన్ని కొనసాగించాలని సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు బట్టు దయానంద రెడ్డి కోరారు.సుమారు 100 బస్తాల వరకు ధాన్యం పండించిన రైతులకు ఐకేపీ సెంటర్ల ద్వారా బార్దానా అందించి, వారి కల్లాల వద్ద నుంచే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించే సౌకర్యాన్ని కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం ఈ విధానం అమలు చేయడం వల్ల చాలామంది రైతులు నేరుగా రైస్ మిల్లులకు వెళ్లి తమ ధాన్యాన్ని స్వయంగా పరిశీలిస్తూ అమ్మకాలు నిర్వహించుకునే అవకాశం లభించిందని తెలిపారు.ఈ విధానం రైతులకు రవాణా భారం తగ్గించడంతో పాటు మధ్యవర్తుల ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయించుకునేందుకు ఉపయోగపడిందని పేర్కొన్నారు. అందువల్ల ఈ సంవత్సరం కూడా అధిక మొత్తంలో ధాన్యం పండించిన రైతులకు అదే విధంగా కల్లాల వద్దనే కొనుగోలు సౌకర్యం కల్పించాలని సీపీఐ పార్టీ తరపున డిమాండ్ చేశారు.ఈ మేరకు సీపీఐ సీనియర్ నాయకులు బట్టు దయానంద రెడ్డి, తీగుల్ గ్రామం ఒక ప్రకటనలో తెలిపారు.



## గృహప్రవేశానికి హాజరైన సరోజ్ రెడ్డి

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని భూత్పూర్ మండలం మదిగట్లలో బుధవారం కొత్త కాపు వెంకట్రామిరెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది,బీఆర్ఎస్ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో సరోజ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి తమ ఇలవేల్పని అందులో భాగంగానే స్వామి వారిని దర్శించుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజలు శాంతి సౌభాగ్యంతో ఉంటూ అభివృద్ధి చెందాలని మల్లన్నను కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ నాయకులు బొచ్చు ఎల్లయ్య, ఏర్పుల రాజు, చెరుకు రమణారెడ్డి, ఉప్పల వంశీ, ఎనిశెట్టి కిరణ్, గుండా మహేష్, ఈగ కనకరాజు, సార్ల కొల్బాయ్ కనకయ్య, పుట్ట శ్రీనివాస్, చింతల రమేష్ తదితరులు ఉన్నారు.





# కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతా..

**-దేవస్థానం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న..**
**-అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవస్థానం వద్దకు తీసుకు వచ్చాం**
**-దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**
**-కురుమూర్తి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం**
**-నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే తో కలిసి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిరచింతకుంట మండలం లోనున్న శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతామని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. కురుమూర్తి దేవస్థానం వద్ద బుధవారం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, అందులో భాగంగా ముఖ్యమంత్రిని స్వయంగా కురుమూర్తి దేవస్థానానికి తీసుకురావడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి భక్తుల సౌకర్యార్థం ఎలివేటెడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ నిర్మాణానికి 110 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారని, పనులు వేగంగా సాగుతున్నాయని, త్వరలో పనులు పూర్తయి భక్తులకు అందుబాటులోకి వస్తుందన్నారు.అంతేకాక దేవాలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ( కాటేజెస్, కళ్యాణమండపం) అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపామని, అదేవిధంగా దేవాలయ అభివృద్ధి పనులకు సంబంధించి పలువురు దాతలను సంప్రదిస్తున్నామని అన్నారు.అదేవిధంగా స్నేహ కంపెనీ యజమాన్యంతో చర్చించి, వారితో ఆలయ మహా మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. పేదల తిరుపతి గా పేరుగాంచిన కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు, కురుమూర్తి దేవస్థానాన్ని యాదగిరి గుట్టలా అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల పనిచేస్తున్నామని అన్నారు. నూతన పాలక మండలి సభ్యులు భక్తులకు అందుబాటులో ఉండాలని కోరుతూ, ఈ సందర్భంగా నూతన పాలకమండలికి ఎమ్మెల్యే జియంఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచి కుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ...కురుమూర్తి స్వామి చాలా మహిమ గల దేవుడని, అనుకున్న కోరికలు నెరవేరుతాయని, దేవుడి ఆశీస్సులతో ఇక్కడికి నాలుగు సార్లు రావడం జరిగిందన్నారు. నూతన పాలక మండలి ప్రమాణస్వీకారంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.దేవస్థానం చైర్మన్ గా బత్తుల బాలరాజ్ ప్రమాణ స్వీకారం..శ్రీ కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గా భక్తుల బాలరాజ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే పాలక మండలి సభ్యులుగా మహిపాల్ రెడ్డి,వేగానాథ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, భరత్ రెడ్డి, బాల్ రాజ్ లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చిన ఆహుతులకు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొత్త అరవింద్ కుమార్ రెడ్డి మరియు మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉండన్నా.. బొట్టు పెడతా..

**-ఎమ్మెల్యే జిఎంఆర్ కు తిలకం దిద్దిన బాలిక**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కు దేవరకద్ర నియోజకవర్గం లో ప్రజల నుండి వస్తున్న ఆదరణ చెప్పనవసరం లేదు. ఎమ్మెల్యే జిఎంఆర్ ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, యువకులు ఎమ్మెల్యే పనితీరుకు నిరాజనాలు పలుకుతున్నారు. అందులో భాగంగానే దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మదనాపురం మండలం నెల్విడి, నర్సింగాపూర్ గ్రామాలలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు వెళ్లిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే జిఎంఆర్ నుదుటున ఉండన్న.. బొట్టు పెడతా అని.. ఓ బాలిక దగ్గరకు వచ్చి తిలకాన్ని దిద్ది అందరి దృష్టిని ఆకట్టుకుంది. దీంతో ఆ బాలికను ఎమ్మెల్యే జిఎంఆర్ ఆప్యాయతతో పలకరించారు.



## వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 13**

జిల్లాలో వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలని కలెక్టర్ అధికారం సూచించారు. పాపన్నపేట్ మండలంలోని కుర్తివాడ గ్రామంలోని ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్ఓ డి ఎం సి ఎస్ ఓ గారితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. స్థానిక హమాలీలను 100 శాతం వినియోగించుకోవాలని , ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద, నిర్వాహకులు పాల్గొన్నారు.













# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి..

**జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త పీ. రామస్వామి**
**-దుబ్బాకలో ఘనంగా విద్యా వారోత్సవాలు..**
**సిద్దిపేట టైమ్స్, దుబ్బాక, మే 13**

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త పీ. రామస్వామి అన్నారు. "ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా బుధవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఐఓసీ భవనంలో క్లస్టర్ ఎంఈఓ జోగు ప్రభుదాస్ అధ్యక్షతన నిర్వహించిన "విద్యా వారోత్సవాల కార్యశాల" ను మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరాం సంగీత రవీందర్, ఏఎంసీ చైర్మన్ కొంగరి రవి, పీఏసీఎస్ చైర్మన్ షేర్ల కైలాష్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు స్వాగత నృత్యం ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రణాళిక తయారుచేసి ఉన్నత అధికారులకు అందించడం జరుగుతుందని, పాఠశాలల్లో వివిధ రకాల మరమ్మత్తు పనులు చేపట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వెల్లడించారు. వర్క్ షాప్ లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న బోధన, విద్యార్థుల అభ్యసనం, పాఠశాల అభివృద్ధి కార్యచరణ, విద్యాశాఖ విషయాలు లక్ష్యాలు ఇతర అంశాల పట్ల నియోజకవర్గంలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు వివరించారు. అమ్మ ఆదర్శ కమిటీలు, గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల పాత్ర, బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై దిశా నిర్దేశం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, ప్రత్యేక చొరవతోనే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలపేతం అవుతాయని స్పష్టం చేశారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ



పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, మున్సిపల్ కౌన్సిలర్లు దేవుని రాజు, శ్రీరామ్ సరస్వతి నరేందర్, ఎండీ. చాంద్ మియా,కోటగల్ల రమ్య రాజేష్, కో ఆప్షన్ మెంబర్లు, సర్పంచ్ల ఫోరం మండలాధ్యక్షులు పర్స దేవరాజు,ఎంపీఓ నరేందర్ రెడ్డి, నియోజకవర్గంలోని సర్పంచ్ లు, ఎంఈఓ లు డీ. అంజయ్య గౌడ్, కనకరాజు, రాజగోపాల్ రెడ్డి, మాస్టర్ ట్రైనీలు సాదత్ అలీ, మధుసూదన్, ఉమా శంకర్, ఎంఆర్ సీ సిబ్బంది గణేశ్, శ్రీధర్, మల్లయ్య, సీఆర్ పీ లు నవీన్, స్వామి, రవి, నాగరాజు పలువురు పాల్గొన్నారు.





# తీగలకుంటపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

**-ఇందిరమ్మ ఇండ్లు పేదలకు వరం**
**-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బసవరాజ్ శంకర్,గ్రామశాఖ అధ్యక్షుడు కోతి ఉదయభాస్కర్**
**సిద్దిపేట టైమ్స్,కోహెడ:**

కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు తీగలకుంటపల్లి గ్రామంలో బుధవారం రోజున ఇట్టిరెడ్డి కనుకవ్వ,లక్ష్మారెడ్డి గృహప్రవేశానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బసవరాజ్ శంకర్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోతి ఉదయ భాస్కర్,ఇట్టిరెడ్డి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలు బలహీన వర్గాలకు ఇంటి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాష్ట్ర రోడ్డు రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపారు.



# కళ్ళం నిండుగా వరి ధాన్యం... అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపం

*** రెండు రోజులుగా ఆగిన లారీలు.. అయోమయంలో అన్నదాతలు**
**దౌల్తాబాద్, మే 13 (సిద్దిపేట టైమ్స్):**

మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళ్ళాల్లో ధాన్యం నిండిపోయినా లారీల కొరత, అధికారుల సమన్వయ లోపం కారణంగా రెండు రోజులుగా ధాన్యం తరలింపు పూర్తిగా నిలిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాలు పడే అవకాశాలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో కష్టపడి పండించిన ధాన్యం తడిసిపోతే నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడంతో రైతులు రాత్రింబవళ్లు కాపలా కాస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.లారీల రాకపోకలు నిలిచిపోవడంతో ఇప్పటికే తూకం వేసిన ధాన్యం కూడా కళ్ళాల్లోనే ఉండిపోయిందని రైతులు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి లారీల సమస్యను పరిష్కరించి ధాన్యాన్ని త్వరితగతిన తరలించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



# ఆటో బోల్తా: బాలుడు మృతి







**-13 మందికి గాయాలు**
**-మహబూబ్ నగర్ కలెక్టరేట్ వద్ద ప్రమాదం**
**-క్షతగాత్రులంతా దమగ్నాపూర్ వాసులు**
**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడడంతో ఒక బాలుడు మృతి చెందగా మరికొంత మంది గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది బొలెరో ఆటోలో భూత్పూర్ మండలం కొత్త మొల్గరలో జరిగిన వివాహ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దమగ్నాపూర్ గ్రామానికి చెందిన మండ్ల నాగరాజ్ కుమారుడు సాయి హర్షిత్ మృతి చెందాడు. మరి కొంతమంది గాయపడ్డారు. గాయపడ్డ వారిని హుటాహుటిన పోలీసులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో నారాయణ గౌడ్, కొండన్నల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ తరలించారు.







# ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పించాలి

**- చేర్యాల ఎంఈఓ నరేందర్**
**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

అన్ని అర్హతలు ఉన్న ఉపాధ్యాయులచే విద్యా బోధన చేస్తూ అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలలోనే విద్యార్థులను చేర్పించాలని చేర్యాల ఎంఈఓ నరేందర్ కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ముస్త్యాల రైతు వేదికలో జనగామ నియోజకవర్గంలోని చేర్యాల మద్దూరు, దూల్మిట్ట కొమురవెల్లి మండలాల విద్యా వారోత్సవాలను నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు మధ్యాహ్న భోజనం కంప్యూటర్ విద్య లైబ్రరీ తదితర సౌకర్యాలు ఉన్నాయని గ్రామాల సర్పంచులు చొరవ తీసుకొని విద్యార్థులు చేరే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఈఓ లు రవి, మీనాంజనేయులు, వరదరాజు వివిధ గ్రామాల సర్పంచులు చేర్యాల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు జిసిడిఓ నర్మదా, జెండర్ స్పెషలిస్ట్ పద్మ, ఆర్పీలు రాకేష్ రెడ్డి, పబ్బోజు రాజమౌళి, బాల భాస్కర్ సీఆర్పీలు పాల్గొన్నారు.



# కొనుగోలు వేగవంతం చేయాలి..

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట మే 13**

కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం కంటాలు వేగవంతం చేయాలని డిప్యూటీ తాహసిల్దార్ రమ్యశ్రీ అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలోని శ్రీ సదాశివ రైస్ మిల్లు సందర్శించి ధాన్యం లారీలను త్వరితగతిన ఖాళీ చేసి కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం ఆలస్యం కాకుండా రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ నిర్వాహకులు రాజి రెడ్డి నవీన్ రెడ్డి, లు ఉన్నారు.



# కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో రాజిరెడ్డి

**సిద్దిపేట టైమ్స్ రామాయంపేట మే 13 ***

నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో రాజిరెడ్డి సందర్శించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కాంటలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కాంటలు వేసిన బస్తాలను త్వరితగతిన లారీలలో రైస్ మిల్లులకు తరలించాలని ఏవైనా ఇబ్బందులు కలిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, కార్యదర్శి చంద్రహాస్, లు ఉన్నారు.



# ఇథనాల్ ఫ్యాక్టరీ మూసివేయాలి..

**-అఖిలపక్ష పార్టీల డిమాండ్..**
**సిద్దిపేట టైమ్స్, బెజ్జంకి, మే 13**

బెజ్జంకి మండల కేంద్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీల వల్ల ఏర్పడుతున్న కాలుష్య సమస్యలపై “రైతు యుద్ధం - ప్రజా ఆరోగ్యం” పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో BRS , CPM, CPI, DSP రాజకీయ పార్టీలు, Mrps ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీల నుండి వెలువడుతున్న విషవాయువులు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారాయని, భూమి మరియు పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, రైతుల వ్యవసాయ భూములు నష్టపోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అదనంగా తీవ్ర శబ్ద కాలుష్యం కారణంగా గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు,ఈ సందర్భంగా ప్రజలు ఐక్యంగా నిరసన తెలుపుతూ MRO అధికారులకు ప్రజా వినతి పత్రం సమర్పించడం జరిగింది. కాలుష్య నియంత్రణ చర్యలు వెంటనే చేపట్టాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, రైతుల భూములకు రక్షణ కల్పించాలని ఫ్యాక్టరీ ముసివేయాలి అని డిమాండ్ చేశారు,గ్రామాల భవిష్యత్తు మరియు ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఈ పోరాటం కొనసాగుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో లింగాల సురేష్ DSP మానకొండూర్ నియోజకవర్గ ఇన్చార్జి, BRS పార్టీ వంగల నరేష్, సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, CPI సహాయ కార్యదర్శి సంగెం మదు,బిఆర్ ఎస్ నాయకులు తిప్పారపు మహేష్, బోనగిరి శివ, దొంతరవెని శ్రీనివాస్ చిలాపూర్ ఉపసర్పంచ్ హరీష్, లింగాల వెంకటేశ్ BJP నర్సింగ్, BSP మాంకాళి సురేష్, CPM నాయకులు సంఘ ఎల్లయ్య, బొమ్మిడి సాయికృష్ణ,బోనగిరి లింగం, పర్శరాములు AIYF మధు,శ్రీనివాస్, లింగయ్య, DSP విజయ్ , DSU శంకర్, MRPS చంద్రం, మాల మహానాడు, SWERO సంస్థల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు



# ఎరువుల వాడకం తగ్గించాలి

**సిద్ధిపేట టైమ్స్, మనోహరాబాద్ :-**

రైతులు పంటల సాగులో ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సవిత,ప్రమీల అన్నారు. బుధవారం మనోహరాబాద్ మండలం చెట్ల గౌరారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు.సేంద్రియ ఎరువుల వినియోగం, నేల ఆరోగ్యం పరిరక్షించుకోవడం,భూసార పరీక్షలు చేసుకోవడం వాటి వల్ల లాభాలు,యూనివర్సిటీ మరియు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలతో పంటలు సాగు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్, ఏఈఓ సచిన్, పాలకవర్గ సభ్యులు, నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.



# అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- తహసిల్దార్ రజనీకుమారి**

**సిద్ధిపేట టైమ్స్ రామాయంపేట మే 13**



మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని మహాదేవ్ ఇండస్ట్రీస్‌ను బుధవారం మండల తహశీల్దార్ రజనీకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మిల్లులో ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం లోడ్లతో వచ్చిన లారీలు మిల్లుల వద్ద వేచి ఉండకుండా, వెంటనే దించుకోవాలని మిల్లర్లను ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అన్‌లోడింగ్ ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లుల్లో నిల్వ చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆమె మిల్లర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, మిల్లు ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయవాది సుడిగాలి పర్యటన

**సిద్ధిపేట టైమ్స్ దేవరకద్ర**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో బుధవారం హైకోర్టు న్యాయవాది, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి సుడిగాలి పర్యటన జరిపారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో జరిగిన వివాహ వేడుకల్లో సరోజ్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.గత కొన్ని రోజులుగా సరోజ్ రెడ్డి దేవరకద్ర నియోజకవర్గం లోని ఆయా మండలాలలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. నిరుపేదల వివాహాలకు పుస్తెల తో పాటు, మృతుల కుటుంబాలకు తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. అలాగే దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపతో పాటు దేవాలయాల నిర్మాణాలకు కూడా తమవంతు సహకారాన్ని అందిస్తున్నారు. నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. పిలిస్తే పలికే నాయకుడిగా నియోజకవర్గంలో మంచి పేరు ప్రతిష్టలు సాధించారు.దీంతో సరోజ్ రెడ్డి పనితీరుపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తపరుస్తున్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ బాల్ రాజ్

**సిద్ధిపేట్ టైమ్స్ రామాయంపేట మే 13 ***



రామాయంపేట మండల పరిధిలోని దంతెపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ మస్కూరి బాలరాజ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం కల్పించిన ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మద్దతు ధరతో పాటు తూకంలో ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యామ్ రాజ్, గ్రామ కార్యదర్శి రామారపు మాధవి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు సొసైటీ నిర్వాహకులు పాల్గొని రైతులకు భరోసా కల్పించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.





# పశువుల అక్రమ రావాణ అరికట్టాలి

***జిల్లా ఎస్పీ -శ్రీనివాస రావు**

**సిద్ధిపేట టైమ్స్, మనోహరాబాద్ /తూప్రాన్ :-**

పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అన్నారు. బుధవారం తూప్రాన్ టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టును ఆయనతనిఖీ చేశారు.ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే అనుమానాస్పద వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అలాగే చెక్ పోస్టుల వద్ద ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల రవాణా తనిఖీల్లో సమన్వయం కోసం వెటర్నరీ సిబ్బంది కూడా నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాత్రి సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ట్రాఫిక్ బ్యాటన్స్ మరియు రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశించరు,"అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలి. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు.ఈ తనిఖీలలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ వెంకట రాజా గౌడ్ , ఎస్సై గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ రావు

**సిద్ధిపేట్ టైమ్స్ రామాయంపేట మే 13**

విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. బుధవారం రామాయంపేట మున్సిపల్ పరిధిలోని కోమటిపల్లి గ్రామ శివారులో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న లాబ్, సెక్యూరిటీ గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్పర్సన్ పోచమ్మల నవనీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయమని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో పాలకవర్గం చురుకైన పాత్ర పోషిస్తోందని, ప్రజలకు జవాబుదారీగా ఉంటూ మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అనురాధ,







కౌన్సిలర్లు, గజవాడ నాగరాజు, బైరం స్వప్న కుమార్, దాకి శ్యామల స్వామి, కొక్కు ప్రవీణ్ కుమార్, దేవుని రంజిత్, పుట్టి సందీప్, గగులోత్ రవి, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, కోఆప్షన్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# శిశు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు

**-జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 13**

శిశు విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.ఆడ శిశువును 3 లక్షలకు అమ్మిన తల్లి తండ్రులు కూల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులు తమ 4 వ శిశువును అమ్ముకున్నారనే విషయం మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టడం జరిగినది. ఇట్టి విచారణలో కన్న తల్లి తండ్రులు తమ పాపను 3 లక్షలకు అమ్ముకున్నారని నిర్ధారించుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ లో తగు చర్యల కొరకై పిర్యాదు చేయడం జరిగినది.ఇట్టి విచారణలో తెలిసినది కూల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులకు ఇదివరకే 3 సంతానం ఉండగా తేదీ 27.3.2026 నాడు మెదక్ లోని MCH Hospital లో ఆడ పాప జన్మించడం జరిగినది. పాపను దంపతు






లిద్దరూ 3 లక్షలకు కొంత మంది మధ్యవర్తుల ద్వారా అల్లినగర్, ములుగు మండలం సిద్దిపేట జిల్లాకు చెందిన దంపతులకు విక్రయించడం జరిగించడం జరిగినది. ఇట్టి విషయం పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి పాపను తీసుకువచ్చి మహిళా శిశు సంక్షేమ అధికారులకు అప్పగించడం జరిగినది అధికారులు సంబంధిత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు పాపను తదుపరి సంరక్షణ నిమిత్తం సంగారెడ్డి లోని శిశుగృహ కు తరలించి ఆశ్రయం కల్పించడం జరిగినది.జిల్లాలో అక్రమ దత్తత తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియచేస్తూ, ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవలంటే ప్రభుత్వ నియమ నిభందనల ప్రకారం మహిళా శిశు సంక్షేమ శాఖ లోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# క్షతగాత్రులను పరామర్శించిన దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్




**-ఎమ్మెల్యే వెంట యెన్నం, స్థానిక మున్సిపాలిటీ డిప్యూటీ మేయర్**

**-తీవ్రంగా గాయపడ్డ వారిని నిమ్స్ కు తరలింపు**

**సిద్దిపేట న్యూస్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరామర్శించారు. చిన్నచింత కుంట మండలం దమగ్నా పూర్ గ్రామానికి చెందిన కొంతమంది బొలెరో వాహనంలో భూత్పూర్ మండలం కొత్త మొల్గరలో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా మహబూబ్ నగర్ లోని కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో వారు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దమగ్నాపూర్ గ్రామానికి చెందిన మండ్ల నాగరాజ్ కుమారుడు సాయి హర్షిత్ మృతి చెందగా, మరికొంతమంది గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్ పుటాహుటిన స్థానిక



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ యం. సురేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ తదితర నాయకులతో కలసి మహబూబ్ నగర్ జిల్లా ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వైద్యులు, హాస్పిటల్ సూపరింటెండెంట్ లతో కలిసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. పరిస్థితి విషమంగా ఉన్న నారాయణ గౌడ్, కొండన్న లను నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే వెంటా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి..

**- అధికారులందరూ సమన్వయంతో పని చేయాలి..**
**- అధికారులకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి దిశా నిర్దేశం..**
**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 13**

రాష్ట్ర రవాణా మరియు బి సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయడం కోసం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..వచ్చే 10రోజులు కొనుగోలులో అత్యంత కీలకం అని కేంద్రాల్లో తేమ శాతం వచ్చిన ధాన్యం, ఎన్ని వాహనాలు అవసరం, దిగుమతి తదితర అంశాలపై అధికారులందరూ సమన్వయంతో ఒక పక్క యాక్షన్ ప్లాన్ ప్రకారం క్షేత్రస్థాయిలో ఎక్కువ మొత్తంలో వాహనాలతో యుద్ధ ప్రతిపాదకన లిఫ్టింగ్ కావాలని ఆదేశించారు.అలాగే లిఫ్టింగ్ తో పాటు టాబ్ ఎంట్రీ, ట్రాక్ షిట్ జెనరేట్ చెయ్యాలని 3 రోజుల్లో పే మెంట్ లో రైతుల ఖాతాల్లో జమ కావాలని తెలిపారు.హమాలీ, ట్రాన్స్పోర్ట్, సమస్య తలెత్తకుండా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా యుద్ధ ప్రతిపాదకన కొనుగోలు చెయ్యాలని ఆదేశించారు.అకాల వర్షాల వలన ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట గజ్వేల్ హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, చంద్ర కళ, రామ్మూర్తి లు, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా సహకార అధికారి వరలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, జిల్లా కార్మిక శాఖ అధికారి



శ్రీనివాసరావు, జిల్లా తూనికలు మరియు కొలతల అధికారి శివరంజని, ఇతర అధికారులు, రైస్ మిల్లర్లు, వరిధాన్యం ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.





# ధర్మారం పి హెచ్ సినీ ఆకస్మికంగా సందర్శించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట మే 13**

రామాయంపేట మండల పరిధిలోని ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్సి) జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డిఎం&హెచ్ఓ) డాక్టర్ శ్రీరామ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు పట్టికలను నిశితంగా పరిశీలించి, మందుల నిల్వలు, ఐఆర్ఎల్ మరియు వ్యాక్సిన్ స్టోరేజ్ పాయింట్లను తనిఖీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న హెచ్పివి వ్యాక్సినేషన్ ప్రచారం పై సిబ్బందికి కీలక సూచనలు చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ టీకా అందేలా చూడాలని ఆదేశించారు. తీవ్రమవుతున్న ఎండల దృష్ట్యా వేసవి కార్యాచరణ ప్రణాళికపై దిశానిర్దేశం చేస్తూ.. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆసుపత్రిలో తగినంత ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఈ సందర్భంగా సిబ్బందిని హెచ్చరించారు.

# విద్యా ప్రమాణాల పెంపుదలకు చర్యలు

**- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**
**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 13**

కస్తూర్బా గాంధీ పాఠశాలలో రూ.42 లక్షలతో అదనపు గదులువిద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పాపన్న పేట కస్తూరిభా గాంధీ పాఠశాల లో సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.42 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు, డార్మిటరీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు .ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు విశాలమైన తరగతి గదులు, వసతిసౌకర్యాలుఅందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా హాస్టల్లో ఉండే బాలికలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పేర్కొన్నారు.





పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనపు మౌలిక వసతులు అవసరమయ్యాయని, ఈ పనులు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ పావని గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేశం, సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్, ఉప సర్పంచ్ సద్దాం హుసేన్, నాయకులు కిష్టయ్య, శివయ్య, అంజి, హీరోలాల్, ప్రవీణ్ గౌడ్, ప్రసాద్ గౌడ్, నాని, సుఫీ,ఖలీం తోపాటు తహసీల్దార్ సతీష్, పీఆర్ ఎఇ శ్రీకాంత్ పాఠశాల ఎస్ ఓ బాల లక్ష్మి, మమత తదితరులు ఉన్నారు.

# ప్రశాంతముగా పాలిసెట్

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 13:**

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతముగా ముగిసింది. మొత్తం 94.6 శాతం మంది పరీక్షకు హాజరు అయ్యారు. మొత్తం సిద్ధిపేట జిల్లాలో పాలిసెట్ కోసం 3932 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం సిద్ధిపేట, రాజగోపాలపేట, చిన్నకోడూరు మండలం మెట్టు బండ, హుస్నాబాద్, గజ్వేలులో మొత్తం 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3932 మందికి 3722 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో బాలురు 1835 మందికి 1735 మంది పరీక్ష రాయడంతో హాజరు శాతం 94.5 నమోదైంది. బాలికలు 2097 మందికి 1987 మంది పరీక్షకు హాజరు కావడంతో హాజరు 94.7 శాతం నమోదైందని పాలిసెట్ జిల్లా సమన్వయకర్త అలుగోజు గోవర్ధన్, సహాయ సమన్వయకర్త బూరం అభినవ్ తెలిపారు. ఈ పరీక్షకు సిద్ధిపేటలో ప్రత్యేక పరిశీలకులుగా మాలతి, ప్రత్యేక తనిఖీ అధికారులుగా రెవెన్యూ శాఖకు చెందిన ఫయాముద్దీన్, పోలీసు శాఖకు చెందిన శ్రీ డీవీఆర్ పాటిల్ వ్యవహరించారు. ఈ పరీక్ష యొక్క ఫలితాలు పది రోజుల్లో వెలువడుతాయని పాలిసెట్ జిల్లా సమన్వయకర్త అలుగోజు గోవర్ధన్, సహాయ సమన్వయకర్త బూరం అభినవ్ పేర్కొన్నారు. ఈ పరీక్షకు సంబంధించిన సహాయ సహకారాలు అందించిన సిద్ధిపేట జిల్లా కలెక్టర్ గారికి, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల, ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగ వంతం చెయ్యాలి..






**- జిల్లా కలెక్టర్ కె. హైమావతి.**
**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 13**

ప్రభుత్వ కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగ వంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.బుదవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, సంగునూరు మండలం ముంద్రాయి గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుందని ఏఎంసిలలో మాత్రమే మక్కల కొనుగోలు సైతం వేగంగా కొనసాగుతుందని తెలిపారు. తేమ శాతం వచ్చి లిఫ్ట్ చెయ్యడానికి తయారుగా ఉన్న ధాన్యాన్ని లారీలు వచ్చే వరకు ఆగకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్ ఇతరత్ర వాహనాలలో ధాన్యాన్ని నింపి మిల్లులకు తరలించాలని ఆదేశించారు.అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు టెంట్, కుండలో తాగునీరు, తాలు తీసే యంత్రాలు, వేయింగ్ మిషన్స్, టార్పాలిన్ కవర్లు, సుతిల్ దారాలు, గన్ని బ్యాగులు ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని సెంటర్ లలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, మిల్లులో దిగుమతిలో జాప్యం జరగకుండా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

# బండి భగీరథ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలి



**- మద్దెల నర్సింలు**
**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 13:**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథకు సంబంధించిన ఆరోపణల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు మద్దెల నర్సింహులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బండి భగీరథపై వచ్చిన ఆరోపణల విషయంలో సంబంధిత పోలీస్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజాసంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నాయకులు స్పందించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. అలాగే, ఈ ఘటనపై ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియా సమగ్రంగా స్పందించి బాధితుడికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. బీజేపీ పార్టీ ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని, అవసరమైతే పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బండి భగీరథను తక్షణమే పోలీసుల ఎదుట హాజరు పరచి విచారణకు సహకరించాలని సంబంధిత అధికారులను కోరారు.

# బక్రీద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పటిష్ట భద్రతా ఏర్పాటు

**- రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్,**
**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 13**

బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఆదేశించారు.ఈ సందర్భంగా డీజీపీ గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రధాన రహదారులు మరియు జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు కట్టుదిట్టం చేయాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో చట్టవ్యతిరేక, రెచ్చగొట్టే, అసత్య ప్రచారాలపై నిరంతర నిఘా ఉంచి, అటువంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ జిల్లా పరిధిలోని అన్ని ప్రవేశ మార్గాల్లో 24/7 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బందితో పాటు వెటర్నరీ సిబ్బందిని కూడా నియమించాలని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు.అలాగే మసీదులు, ప్రార్థనా స్థలాలు మరియు రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలకు భద్రత కల్పించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఎలాంటి చట్టవ్యతిరేక, అసభ్యకరమైన, అసత్య సమాచారాన్ని ప్రచారం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.బక్రీద్ పండుగను అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవం, మత సామరస్యం మరియు శాంతియుత సహజీవనంతో జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ కోరారు. ఈ సమావేశానికి ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, సిద్దిపేట డివిజన్ ఏసిపి రవీందర్ రెడ్డి ,హుస్నాబాద్ ఏసీపి సదానందం, సిఐలు మరియు వెటర్నరీ, మున్సిపల్ సిబ్బంది హాజరయ్యారు.






# విద్యా వారోత్సవాల్లో గ్రామ సర్పంచులతో సమావేశం

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 13:**

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాల మూడవ రోజు జిల్లా కలెక్టరేట్ లో గ్రామ సర్పంచులతో సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. జీవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కళాశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల గురించి వివరించారు.గ్రామాల్లో డిగ్రీ చదవబోయే విద్యార్థినులను ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చేర్పించేందుకు గ్రామ సర్పంచులు సహకరించాలని కోరారు. అలాగే విద్యా వారోత్సవాల నాలుగవ రోజు సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ సువర్ణ దేవి, కిషోర్ తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి





**- చందాపూర్‌లో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.**

**సిద్దిపేట టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 13**

మెదక్ జిల్లా శంకరంపేట మండలంలోని చందాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులను అభినందించారు.అమ్మవారి కృపతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని కోరుతూ, దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం చందంపేట్ బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సురేష్ వివాహము మండల కేంద్రంలోని రాధాస్వామి ఫంక్షన్ హాల్ లో అదే అదేవిధంగా శంకరంపేట్ బిఆర్ఎస్ కార్యకర్త హేమ. నర్సింలు కుమార్తె వివాహం కూడా మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శంకరంపేట ఆర్ మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి.రాజు,పట్టణ అధ్యక్షులు హేమ చంద్రం, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, కుమార్ గౌడ్, సర్పంచ్ లు చెన్నైగౌని కృష్ణా గౌడ్, ఇమ్మడి నరేష్, నాయిని ప్రవీణ్, మాజీ సర్పంచ్ సుంకరి కుమార్ గౌడ్, మంచాల లక్ష్మణ్, తాటికొండ శ్రీలత స్వామిరాజ్, పడాల రమాదేవి శ్రీనివాస్, మండల నాయకులు యేమ చంద్రం, యేమ శ్రీనివాస్, యెల్లోళ్ల నవీన్, ఆలూరి రవి, , శేరి స్వామి, , చెన్నైగౌని శేఖర్ గౌడ్, ముదిరాజ్ సంఘం నాయకులు శివరాములు, సత్యనారాయణ, పోతారాజు రాజు, పోతారాజు శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చందాపూర్‌లో ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం..





**- ప్రత్యేక పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి..**

**సిద్దిపేట టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 13**

శంకరంపేట ఆర్ మండలంలోని చందాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయి భక్తులతో కళకళలాడింది. ఈ మహోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మండల నాయకులతో కలిసి పాల్గొని పెద్దమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఐక్యత, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు మరింత బలపడాలని కోరుకున్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయంగా రూ. 21 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపి తిరుపతి రెడ్డి గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు.





# రాజీవ్ రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం..

**- నాలుగు వాహనాలు ధ్వాంసం..**

**- ఒకరికి తీవ్ర గాయాలు**

**సిద్దిపేట టైమ్స్, బెజ్జంకి, మే 13**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని రేగులపల్లి గ్రామ శివారులో రాజీవ్ రహదారి పై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నాలుగు వాహనాలు తీవ్రంగా దెబ్బతినగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ఘటన స్థలం నుంచి పరారాయ్యడు. పోలీసుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి గ్రామానికి చాందిన చొప్పరి సంపత్ (38),అతని తమ్ముడు చొప్పరి చందు ట్రక్టర్ (TS22T1099) పై తంగళ్లపల్లి ఐకేపీ సెంటర్ నుంచి వారి లోడును ఎక్కించుకుని మల్లారం గ్రామంలోని రామాంజయనేయ ఆగ్రో మిల్ కు బయలుదేరారు.రేగులపల్లి గ్రామ శివారులోని సెయింట్ పల్లోటి స్కూల్ సమీపనికి చేరుకున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన అశోక్ లీలాండ్ ఇసుక లారీ (TS36TA6966) అతివేగంగా వచ్చి ట్రాక్టర్ ట్రైలర్ వెనుక భాగాన్ని ఢీకొట్టింది.ఈ ఢీకొట్టడంతో ట్రాక్టర్ అదుపుతాప్పి ముందుకు దూసుకెళ్లి అక్కడే నిలిపి ఉన్న మారుతీ బ్రెజ్జా కారు (TG02B0671),ఇన్నోవా కారు (TG21T1653)లను ఢీకొట్టింది. అనంతరం ట్రాక్టర్ రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొని ఆగిపోయింది.ఈ ప్రమాదంలో ట్రాక్టర్, ట్రైలర్ తో పాటు రెండు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ట్రాక్టర్ లో ఉన్న వరి లోడు కూడా చేదిరిపోయి నష్టం వాటిల్లింది. ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ చొప్పరి చందుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా సిద్దిపేట లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరరైనట్లు పోలీసులు తెలిపారు. ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పరారిలో ఉన్నడ్రైవర్ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# నిధుల దుర్వినియోగం చేసిన మున్సిపల్ అధికారులపై చర్యలు చేపట్టాలి

**- మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు**

**సిద్దిపేట టైమ్స్ రామాయంపేట మే 13**

రామాయంపేట మున్సిపాలిటీ అవినీతికి నిలయంగా మారుతోందా? ప్రజాధనం పక్కదారి పడుతుంటే పాలకవర్గం ప్రేక్షక పాత్ర వహించాలా? అంటూ మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్ పర్సన్ నవనీత అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. గత మూడు నెలలుగా జరిగిన మూడు బాడీ మీటింగ్లలో ఎలాంటి చర్చా లేకుండానే, సుమారు ₹15 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్స్ను కమిషనర్ మరియు ఇతర అధికారులు కుమ్మక్కై స్వాహా చేశారని కౌన్సిల్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సూచనలతో అధికారులకు అవకాశం ఇచ్చినా, వారి తీరులో మార్పు రాకపోగా అవినీతి అక్రమాలు పరాకాష్టకు చేరాయని ధ్వజమెత్తారు. కేవలం నిధుల మళ్లింపే కాకుండా, సామాన్యులు ఇల్లు కట్టుకోవడానికి అనుమతుల కోసం





వస్తే లక్షల్లో ముడుపులు డిమాండ్ చేస్తూ ప్రజలను పీడిస్తున్నారని కౌన్సిలర్ గజవాడ నాగరాజు మండిపడ్డారు. బ్లీచింగ్ పౌడర్, ట్రీ గార్డులు, చెత్త బుట్టల కొనుగోళ్ల పేరుతో సాగిన ఈ 'అవినీతి భాగోతం'పై పూర్తి ఆధారాలతో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సిద్దిపేట రాజకీయ నాయకుల కనుసన్నల్లో మెలుగుతూ, రామాయంపేట అభివృద్ధిని అడ్డుకుంటున్న అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా కౌన్సిల్ సభ్యులంతా ఏకమై నిరసన గళం విప్పారు. ప్రజాధనాన్ని కాజేసిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు గగులోత్ రవి, బైరం స్వప్న కుమార్, దా కి శ్యామల స్వామి, పుట్టి సందీప్, దేవుని రంజిత్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు గౌస్, దేమె యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# గోపన్ పల్లి ప్రధానో పాధ్యాయుడికి ప్రశంసలు



GOVERNMENT OF TELANGANA
SCHOOL EDUCATION DEPARTMENT
TELANGANA RISING
CURE · PURE · RARE
CERTIFICATE OF APPRECIATION

This is to proudly recognize

SMT/SRI MOHD. ABDUL HAQ

HM / Teacher / Staff at ZPHS GOPANPALLY, DEVARKADARA, MAHABUBNAGAR DISTRICT

For demonstrating outstanding regularity by maintaining over 90% attendance and exhibiting a high level of commitment to duty. With remarkable regularity and perseverance, you have been present on nearly every working day, setting a commendable example for students and fellow educators alike. Your commitment significantly contributes to fostering a culture of discipline, continuity, and excellence within the school community.

Dr. E. Naveen Nicolas, IAS.
Director of school Education
& State Project Director.
Samagra Shiksha Telangana

Piace : Hyderabad
Date : 06/03/2026 to 12/06/2026

**-ఎఫ్ ఆర్ ఎస్ లో 90 శాతం కంటే ఎక్కువ హాజరు**

**-ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ హాఖ్ కు ప్రశంసా పత్రాన్ని పంపించిన పాఠశాల విద్యా కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం గోపన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అబ్దుల్ హాఖ్ కు బుధవారం పాఠశాల విద్యా కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ప్రశంసా పత్రాన్ని పంపించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో ప్రవేశపెట్టిన ఎఫ్ ఆర్ ఎస్ హాజరు నమోదులలో 90 శాతం కంటే ఎక్కువ హాజరుతో జడ్పీహెచ్ఎస్ గోపన్ పల్లి ప్రధానో పాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ హాఖ్ కు ఈ ప్రశ్న పత్రాన్ని ఆయన పంపించారు. ప్రభుత్వ పాఠశాలలో నిబద్ధతతో పనిచేసే వారికి ఒక ప్రేరణగా ఇది పని చేస్తుందని, అలాగే ఓ ప్రశంసా పత్రం సంతోషాన్ని కలిగించిందని అబ్దుల్ హాఖ్ ఈ సందర్భంగా తెలిపారు. తనకు ప్రశంసా పత్రాన్ని పంపించినందుకు కమిషనర్ కు ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ హాఖ్ ధన్యవాదాలు తెలిపారు.



# బీరప్ప స్వామి దయతో ప్రజలు చల్లగా ఉండాలి

**- గాంధారిపల్లి బీరప్ప స్వామి జాతర ఉత్సవాల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మదేవేందర్ రెడ్డి..**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 13**

మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలంలోని గాంధారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప స్వామి జాతర మహోత్సవాల్లో మండల నాయకులతో కలిసి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మదేవేందర్ రెడ్డి పాల్గొని బీరప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బీరప్ప స్వామి దయతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు, పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడతాయని అన్నారు. ఇలాంటి ఉత్సవాలు గ్రామాల్లో భక్తి భావనను పెంపొందించడమే కాకుండా ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జాతరను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. గ్రామ దేవతల పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసం, భక్తి భావం తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలా గౌడ్,పాపన్నపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరామ్ రెడ్డి,సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షులు కుమ్మరి జగన్ మాజీ సర్పంచ్ లు దావుల. శ్రీనాథరావు,లింగారెడ్డి ఏడుకొండలు,స్రవంతి శ్రీనివాస్ గాంధారి పల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విశ్వాస్ రెడ్డి, బిఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు,యువకులు, భక్తులు పాల్గొన్నారు.



